"లేదు స్వామీ! మీరెళ్ళాక నేను విలపిస్తూంటే ఓ సన్యాసి వచ్చి 'ఒక్క గంట ఓపిక పట్టు. పూజారి వచ్చి మళ్ళీ ఆలయం తలుపు తీస్తాడు. దైవ దర్శనం చేసుకుని వెళ్ళు.' అని చెప్పి చలికి మంట వేసి వెళ్ళిపోయాడు. అతను చెప్పినట్లుగానే మీరు వచ్చారు." చెప్పాడా భక్తుడు.

తన నిజమైన భక్తులకి కేదారేశ్వరుడు ఆర్నెల్లని ఓ గంటలా గడిపేలా చేయడంలో పెద్ద విశేషం ఏమీ లేదు.

## 74. గీతా ప్రభావం

నిత్యం భగవద్గీతని పారాయణం చేసే ఆచారం గల ఓ ఇంటి పక్కన వున్న ఇంటికి అలాంటి ఆచారం లేని ఓ అమ్మాయి కోడలుగా వచ్చింది. ఆమెకి ఇద్దరు పిల్లలు కలిగారు. వాళ్ళకి ఆరో ఏడు రాగానే తన పిల్లల చేత గీతా పారాయణం చేయించాలనే తలంపు ఆమెకి కలిగింది. కాని పెద్దయ్యాక వాళ్ళు ఇల్లు విడిచి సన్యసిస్తారేమోనన్న ఓ భయం వల్ల ఆమె ఆ పని చేయలేదు.

ఓ సారి పక్క ఇంటికి ఓ మఠాధికారి భిక్షకి వచ్చాడు. సమయం చూసి ఆమె అతన్ని అడిగింది.

"స్వామి! నా పిల్లలు కూడా గీత చదివితే లోకం మీద విరక్తి కలిగి, పెద్దయ్యాక సన్యాసుల్లో కలిసిపోతారేమోనని భయంగా వుంది. అలా జరిగే అవకాశం వుందా?"

అందుకాయన నవ్వి జవాబు చెప్పాడు.

"పిచ్చిదానా! గీతా పారాయణం వల్లనే ప్రపంచం మీద విరక్తి, వైరాగ్యాలు కలిగే పక్షంలో ప్రపంచం ఎంతో బాగుపడేది. ఆ భయం వద్దు."

"కాని స్వామి..."

"మోహ కారణంగా అర్జునుడు తన క్షాత్ర ధర్మాన్ని విడిచిపెట్టి బిచ్చమెత్తుకుని జీవించడానికైనా సిద్ధపడ్డాడు. అప్పుడు సాక్షాత్తు పరమాత్మే ముఖాముఖీ అర్జునుడికి గీతా బోధ చేసాడు. అవునా?" ప్రశ్నించాడాయన.

"అవును స్వామి." ఒప్పుకుందామె.

"ఆ తర్వాత తన తప్పిదాన్ని గ్రహించిన అర్జునుడు కౌరవులతో యుద్ధం చేసాడు. అంటే మనిషి తన కర్తవ్యాన్ని చక్కగా నెరవేర్చేలా చేస్తుంది తప్ప గీత ఎవర్నీ సన్యాసిని చేయదని దీన్ని బట్టి అర్థం కావడం లేదూ?"

"నిజమే స్వామి." ఒప్పుకుంది.

"అంతే కాదు. అర్జునుడు ఆ తర్వాత సన్న్యసించాడా? లేదు. హాయిగా కాపురం చేసుకున్నాడు."

ఆ సమాధానానికి ఆమెలోని భయం చేత్తో తీసేసినట్లుగా పోయింది. తన పిల్లల చేత గీతా పారాయణం చేయించసాగింది.

## 75. దుర్మార్గపు అవివేకి

ఓ ఆలయానికి వచ్చే భక్తులకి ప్రసాదం చేసి పెట్టడానికి వీలుగా పెద్ద ఇత్తడి గిన్నెని కొనాలని ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడికి పూజారి సూచించాడు.

"ఊహు. మన దగ్గర ఉన్న కాస్త డబ్బుతో భక్తులు కానుకలు వేయడానికి అనువుగా ఓ హుండీని కొనాలని బోర్డు సభ్యులు నిర్ణయించారు." చెప్పాడు అధ్యక్షుడు.

"రాత్రి స్వామివారు నా కల్లో కనబడి ఆ డబ్బుతో ఇత్తడి గిన్నెనే కొనమని చెప్పారు." అభ్యంతరం చెప్పాడు పూజారి.

"కాని ఆయన నాకా సంగతి చెప్పలేదు కదా? ఎలా నమ్మమంటావది?"

"సరే. నేను దేవుడ్ని ప్రార్థిస్తాను. ఆ సంగతి ఆయన ఏదైనా సూచన ద్వారా తెలియచేయచ్చు. దీన్ని బోర్డు మీటింగ్‌లో ఓటింగ్‌కి పెడదాం." దైవ భక్తుడైన పూజారి సూచించాడు.

ఆ ప్రకారం తొమ్మిదిమంది సభ్యులుగల బోర్డు మీటింగ్ జరుగుతూండగా పూజారి దేవుడ్ని ప్రార్థించసాగాడు. ఆ అంశం ఓటింగ్‌కి పెట్టబోతూండగా ఆకాశంలో అకస్మాత్తుగా నల్లటి దట్టమైన మేఘాలు ఆవరించి వెంటనే జోరున వర్షం కురిసి, పెద్ద మెరుపు మెరిసి కిటికీలోంచి ఓ పిడుగు వచ్చి ఆ గదిలో అధ్యక్షుడి పక్కనే పడింది.